1 St Year Happy Work Anniversary.

షణ్ముఖ

RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers

THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 197 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 11 జూన్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 197 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 11 June 2025 PAGES : 8 PRICE : 3/-



# ఉగ్రవాదాన్ని ప్రపంచ సమస్యగా చూడాలి జైశంకర్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 10)

ఉగ్రవాదం అనే దానిని ప్రపంచ సమస్యగానే చూడాలిగానీ.. అది ద్వైపాక్షిక అంశం కాదని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ వెల్లడించారు. చరిత్రను పరిశీలిస్తే.. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఉగ్రఘటనలకు పాక్‌తో సంబంధాలు బయటకొచ్చాయన్నారు. వారం రోజులపాటు ఐరోపా దేశాల పర్యటనలో భాగంగా ఆయన బెల్జియం,



-మిగతా 5లో

# ప్రజలే కేంద్రంగా పాలన

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 10)

తన నేతృత్వంలోని 11 ఏళ్ల పాలనలో దేశం అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించడంతోపాటు వాతావరణ మార్పులు, డిజిటల్ నవకల్పనలు వంటి అంశాల్లో ప్రపంచ వేదికపైనా బలమైన ముద్ర వేసిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయాస్' (అందరితో కలిసి.. అందరి అభివృద్ధికి.. అందరి విశ్వాసంతో.. అందరి కృషితో) అనేదే తమ పాలనను నిర్దేశించే మూలసూత్రమని చెప్పారు. తన నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మూడో విడత పాలనలో తొలి ఏడాది పూర్తిచేసుకోవడం, మొత్తంగా ప్రధానిగా పగ్గాలు చేపట్టి సోమవారానికి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయాలను '11 ఏళ్ల



-మిగతా 5లో

# రాష్ట్రవ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాలపై దాడులు అప్రజాస్వామికం

- కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్‌పై మాజీ సీఎం జగన్ ఆగ్రహం
- మహిళల గౌరవం పేరుతో టీడీపీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని ఆరోపణ
- చంద్రబాబు, బాలకృష్ణ గత వ్యాఖ్యలను గుర్తుచేసిన జగన్
- హామీల వైఫల్యం నుంచి దృష్టి మరల్చేందుకే చంద్రబాబు యత్నం అంటూ విమర్శలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 10)

రాష్ట్రవ్యాప్తంగా సాక్షి మీడియా కార్యాలయాలపై వ్యవస్థీకృత దాడులు జరుగుతున్నాయని, ఇది అప్రజాస్వామికం అని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. ఇవి ప్రజాస్వామ్యంపై ఉద్దేశపూర్వకంగా, పథకం ప్రకారం జరుగుతున్న దాడులని ఆయన అభివర్ణించారు. సాక్షి టీవీ యాంకర్, సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్‌ను జగన్ ఖండించారు. సోమవారం నాడు కొమ్మినేని శ్రీనివాసరావును పోలీసులు అరెస్ట్ చేయగా, మంగళవారం గుంటూరులోని కోర్టు ఆయనకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. సాక్షి చానల్లో కొమ్మినేని వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఓ కార్యక్రమంలో అమరావతి ప్రాంత మహిళలపై కించపరిచేలా మాట్లాడారన్నది ఆయనపై ఉన్న ఆరోపణ. అయితే, కొమ్మినేని ఎప్పుడూ అనని మాటలను ముఖ్యమంత్రి చంద్రబాబు వక్రీకరించి, ఆయనపై తప్పుడు కేసు బనాయించి, అక్రమంగా అరెస్ట్ చేయించారని జగన్ ఆరోపించారు. "మహిళల గౌరవాన్ని కాపాడే నెపంతో, ముందస్తు ప్రణాళిక ప్రకారం టీడీపీ మూకలు పలు జిల్లాల్లోని సాక్షి యూనిట్ కార్యాలయాలను ధ్వంసం చేశాయి. ఇది మహిళల పట్ల ఆందోళనగా చిత్రీకరిస్తున్న రాజకీయ కక్ష సాధింపు చర్య తప్ప మరొకటి కాదు" అని జగన్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

గతంలో చంద్రబాబు, ఆయన బావమరిది బాలకృష్ణ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఈ సందర్భంగా జగన్ ప్రస్తావిస్తూ, వారి నైతికతను ప్రశ్నించారు. "కోడలు అత్తగారిని కాకుండా భర్తనే ఇష్టపడుతుంది కదా అని మీరొకసారి అన్నారు. మీ బావమరిది అయితే అమ్మాయి కనిపిస్తే ముద్దయినా పెట్టాలి లేదా కడుపైనా చేయాలి అన్నారు. మహిళలను గౌరవించే విషయంలో ఇవి మీ ప్రమాణాలు!" అని జగన్ రాశారు.



తిరిగి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలు, బాలికలకు భద్రత, న్యాయం కల్పించడంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని మాజీ సీఎం ఆరోపించారు. అనంతపురంలో అదృశ్యమై, ఆ తర్వాత దారుణంగా హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని తన్మయి కేసులో అధికారులు సత్వర చర్యలు తీసుకోలేదని ఆయన ఉదహరించారు. అలాగే, శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో 9వ తరగతి బాలికను 14 మంది ఆరు నెలలుగా బ్లాక్‌మెయిల్ చేసి అత్యాచారం చేసినా పోలీసులు ఆమె ఫిర్యాదుపై చర్యలు తీసుకోలేదని ఎత్తి చూపారు."కేవలం ఏడాది టీడీపీ పాలనలో 188 మంది మహిళలు, బాలికలపై అత్యాచారాలు జరిగాయి, వారిలో 15 మంది హత్యకు గురయ్యారు. వేధింపులు, హింసకు సంబంధించిన వందలాది కేసులు శిక్ష పడకుండానే మిగిలిపోయాయి" అని జగన్ పేర్కొంటూ, -మిగతా 5లో

# సజ్జల మూర్ఖుడిలా మాట్లాడారు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 10)

అమరావతి మహిళలపై వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళలను కించ పరుస్తూ సజ్జల ఒక మూర్ఖుడిలా మాట్లాడారని మండిపడ్డారు. వైకాపా చేసిన తప్పునే మళ్లీ మళ్లీ చేస్తోందన్నారు. "సజ్జల కుమారుడు భార్గవ్‌రెడ్డి సోషల్‌మీడియాను అడ్డుపెట్టుకొని నాపై కూడా దుష్ప్రచారం చేశారు. వైఎస్ కుమార్తె, ఒక మహిళ అని కూడా చూడకుండా కించపరిచారు. జగన్ అందరినీ నా అక్కాచెల్లెళ్లు అంటారు.. కానీ, ఆయన సొంత చెల్లికే మర్యాద లేదు. ఇక రాష్ట్రంలోని మహిళలను ఏం గౌరవిస్తారు?"అని విమర్శించారు.

పార్టీలో కొందరి తీరుపై షర్మిల అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మహా సముద్రమని.. అందులో మంచితోపాటు చెత్త కూడా ఉంటుందన్నారు. "పార్టీ అభివృద్ధి చెందు తుంటే కిందకి లాగేవాళ్లు ఉన్నారు. వారే పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారు. పార్టీకి క్రమశిక్షణ కమిటీ ఉంది. అలాంటి వారిపై చర్య లు తీసుకుంటాం. సొంతపార్టీపై దుష్ప్రచారం చేస్తే ఊరుకునేది లేదు"అని హెచ్చరించారు.

# విభేదాలు సృష్టించేందుకు వైకాపా కుట్ర

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 10)

రాష్ట్రంలో ప్రాంతాలు, కులమతాల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రతిపక్ష వైకాపా కుట్ర పన్నుతోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. " కూటమి సర్కారుది కక్షసాధింపు కాదు. చట్టాన్ని ఉల్లంఘించి, ప్రజలను, పార్టీ కార్యకర్తలను ఇబ్బందిపెట్టినవారిని చట్ట పరిధిలోనే శిక్షిస్తాం" అని వ్యాఖ్యానించారు. పార్వతీపురం మన్యం జిల్లా చినబొండపల్లిలో సోమవారం తెదేపా నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో లోకేశ్ మాట్లాడారు. పార్వతీపురం నియోజకవర్గంలో 61 మందికి 'ఉత్తమ కార్యకర్త' పురస్కారాలను అందించారు. ఎవరూ అహంకారంతో వ్యవహరించొద్దని, ఎంత ఎదిగితే అంత ఒదిగి ఉండాలని కార్యకర్తలకు సూచించారు. వైకాపా దుష్ప్రచారాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



వేదికపై ఓ కార్యకర్త కుమార్తెకు శాలువా కప్పి ముద్దుచేస్తున్న లోకేశ్

**అదీ ప్రజాతీర్పు..**

"ఈ రోజు చాలా వింత పరిస్థితి చూశా. దారి పొడవునా పోలీసులే. యువగళంలో నాడు వారే నన్ను అడుగడుగునా అడ్డుకున్నారు. నేడు సెల్యూట్ చేస్తున్నారు. అదీ ప్రజాతీర్పు" అని లోకేశ్ చెప్పారు. ప్రతిపక్ష నేతకు భద్రత కల్పించినా శాసనసభకు రావట్లేదని మంత్రి లోకేశ్ ఎద్దేవా చేశారు. అహంకారం, అడ్డగోలు అరెస్టులు, బూతులు వద్దని ప్రజలు వైకాపాను తిరస్కరించారు. ప్రగతి, సంక్షేమం కోరుతూ కూటమికి బ్రహ్మరథం పట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తొడగొట్టిన అంజిరెడ్డి తాత, రక్తం కారుతున్నా చివరి ఓటు వరకు బూత్‌లో -మిగతా 5లో

# కాంగ్రెస్ పార్టీలో వారికే పదవులు దానం నాగేందర్

- కాంగ్రెస్ పార్టీలో హామీలకు కాకుండా పని చేసే వారికే గుర్తింపు అన్న దానం
- సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గ విస్తరణ దేశానికే ఆదర్శం
- ఎస్సీ, బీసీలకు గతంలో ఎన్నడూ లేనంత ప్రాధాన్యం ఇచ్చారు
- రాహుల్ గాంధీ ఆశయాలను సీఎం రేవంత్ ముందుకు తీసుకెళుతున్నారు
- జీహెచ్ఎంసీ కోటాలో మంత్రి పదవికి ఇంకా సమయం ఉందని వెల్లడి



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 10)

కాంగ్రెస్ పార్టీలో పదవులు ఆశించేవారు కేవలం హామీలపైనే ఆధారపడకూడదని, నిబద్ధతతో పనిచేస్తేనే తగిన గుర్తింపు లభిస్తుందని ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్ అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేపట్టిన మంత్రివర్గ విస్తరణ దేశానికే ఆదర్శప్రాయంగా నిలిచిందని ఆయన కొనియాడారు.మంగళవారం -మిగతా 5లో

# మోదీ సర్కారు దేశ భద్రతను బలోపేతం చేసింది రాజ్‌నాథ్ సింగ్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 10)

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. 11 ఏళ్ల పాలనలో దేశ భద్రతను మరింత బలోపేతం చేశామని అన్నారు. దేహ్రాదూన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ"గత 11 ఏళ్లలో మోదీ సర్కారు దేశ భద్రతను బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేసింది. దేశ భద్రత విషయంలో కేంద్రం వ్యవహార శైలి మారింది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఇది స్పష్టమైంది. భారత చరిత్రలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తీసుకున్న అతి పెద్ద చర్య. దీన్ని ప్రపంచమంతా చూసింది. " అని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. కాగా.. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. పురుషులే లక్ష్యంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి తాము బాధ్యులమని పాక్ కేంద్రంగా ఉన్న లష్కరే తోయిబాకు చెందిన "ది రెసిస్టెన్స్ ఫ్రంట్" బాధ్యత ప్రకటించుకుంది.

# అనుమతులన్నీ ఇస్తున్నాం.. సకాలంలో పనులు జరగాల్సిందే

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 10)

'అవసరమైన అనుమతులన్నీ ఇస్తున్నాం. ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కరిస్తున్నాం. ఏ ఆటంకాలూ లేకపోయినా పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోంది? ఇకపై గడువులోగా జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి కావాల్సిందే' అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. హైవేల నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తే, ఆయా గుత్తేదార్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలంటూ తానే కేంద్రాన్ని కోరతానని హెచ్చరించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఎన్‌హెచ్ ప్రాజెక్టులపై అధికారులు, గుత్తేదారులతో సీఎం చంద్రబాబు సోమవారం సచివాలయంలో సమీక్షించారు. బెంగళూరు-కడప- విజయవాడ ఎన్‌హెచ్‌లో భాగమైన కోడూరు క్రాస్-కడప- ముప్పవరం ప్యాకేజీలో -మిగతా 5లో



# బెంగాల్‌లో సునీతా విలియమ్స్ మైనపు విగ్రహం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 10)

భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ మైనపు విగ్రహాన్ని పశ్చిమ బెంగాల్‌లోని అసన్సోల్‌లో ఆవిష్కరించారు. సుశాంత రాయ్ అనే శిల్పి ఈ విగ్రహాన్ని రూపొందించారు. -మిగతా 5లో



# ఆపరేషన్ కగార్ తక్షణం ఆపండి

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 10)

ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో కొనసాగిస్తున్న నరమేధాన్ని ఆపాలని సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్), ఆర్ఎస్పీ, ఏఐఎఫ్‌బీ ప్రధాన కార్యదర్శులు ఎంఏ.బేబీ, డి.రాజా, దీపాంకర్ భట్టాచార్య, మనోజ్‌భట్టాచార్య, జి.దేవరాజన్‌లు సోమవారం ఉమ్మడిగా ప్రధాని మోదీకి లేఖ రాశారు. ప్రస్తుతం పలువురు సీనియర్ మావోయిస్టు నేతలు భద్రతాదళాల నిర్బంధంలో ఉన్నట్లు తెలిసిందని, వారిని కోర్టు ముందు హాజరుపరచాలని డిమాండ్ చేశారు. "ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో పూర్తిగా భద్రతాదళాలను మోహరించడంతో సామాన్య జీవనానికి ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు అక్కడున్న ఆదివాసీలు ఫిర్యాదుచేస్తూ వస్తున్నారు. సమస్యల పరిష్కారానికి చర్చలు చేపట్టాలని ప్రభుత్వానికి ఇప్పటికే అన్ని రాజకీయపార్టీలు, సామాజిక సంఘాలు పిలుపునిచ్చాయి. దాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణం చట్టవ్యతిరేక హత్యలు, హింసను నిలిపేయాలి" అని వారు ఈ లేఖలో ప్రధానిని డిమాండ్ చేశారు.

# కుంభకోణాలకు, విభజనవాదానికి ఎన్డీయే పాలనలో చెల్లుచీటీ: భాజపా



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 10)

ఎన్డీయే సర్కారు గత 11 ఏళ్లలో దేశంలో తెచ్చిన మార్పులు చరిత్రలో స్వర్ణాక్షరాలతో నిలిచిపోతాయని భాజపా పేర్కొంది. కుంభకోణాలకు, విభజనవాద రాజకీయాలకు అడ్డుకట్ట పడిందని పార్టీ అధ్యక్షుడు జె.పి.నడ్డా పేర్కొన్నారు. 370 అధికరణం, తక్షణ.. ముమ్మారు తలాక్, పెద్దనోట్లను రద్దు చేయడమ్మ వక్ఫ్‌చట్టానికి సవరణ, మహిళా బిల్లు వంటివి ఎన్డీయే సాహసోపేత నిర్ణయాలని తెలిపారు. లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ బాధ్యతలేని నాయకుడని విమర్శించారు. దేవుడు ఆయనకు కాస్త బుద్ధిని ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. గత 11 ఏళ్ల కాలం ఒక స్వర్ణయుగమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. 'గత ప్రభుత్వాలకు విధానాల్లేవు, నాయకత్వం లేదు. అప్పట్లో కుంభకోణాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. పాలనావ్యవస్థకు దిశానిర్దేశం లేదు. 11 ఏళ్లలో ఇవన్నీ మారాయి. బుజ్జగింపులకు బదులుగా అందరితో కలిసి పనిచేసే సంస్కృతిని ప్రధాని నరేంద్ర మోదీ సృష్టించారు' అని చెప్పారు. పలువురు ఇతర మంత్రులు కూడా ప్రభుత్వ విజయాలను కొనియాడారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం




## ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పటిష్టంగా చేపట్టాలి

**కలెక్టర్‌లకు సూచించిన సీసీఎల్‌ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)

ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియను పటిష్టంగా చేపట్టడంతో పాటు ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సిసిఎల్‌ఏ (తరువాయి 4లో...)

# ఏం ఉద్ధరించారని జగన్ పొదిలి పర్యటన

- సొంత కార్యకర్తలకు కూడా న్యాయం చేయని పరిస్థితి
- జగన్ పర్యటన పై మీడియా సమావేశంలో

**ఫైర్ అయిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 10)

ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా అభివృద్ధిని మరచి పశ్చిమ ప్రాంతంలోని పొదిలికి నేడు ఏ మొహం పెట్టుకొని వస్తున్నారని, ఏం ఉద్ధరించారని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జగన్ పొదిలి పర్యటన సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్థానికంగా ఫైనాన్స్ ఆఫీస్ నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. అమరావతి మహిళలను వేశ్యలుగా కించపరిచిన వ్యక్తులకు రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదన్నారు. అధికారంలో ఉన్నపుడు ప్రాజెక్టు పూర్తి చేయకుండానే వెలిగొండను జాతికి అంకితం చేస్తున్నాని ఆర్భాటం చేసిన వ్యక్తి జిల్లా అభివృద్ధి పై మొసలికి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలోని చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా కేంద్రంగా అభివృద్ధికి పునాదిరాళ్లు వేస్తుంటే దాన్ని అడ్డుకునే వ్యక్తిగా ఈ జిల్లాకు వచ్చి ఏం ఉద్ధరిస్తారని విమర్శించారు. మార్కాపురం బహిరంగ సభలో మీరు పొదిలి పట్టణానికి రూ.50 కోట్లతో మంచినీళ్లు తెస్తామని హామీ ఇచ్చి కనీసం ఆర్థిక అనుమతి కూడా ఇవ్వలేదన్నారు. కాంట్రాక్టర్ ను బెదిరించి పనులు ప్రారంభింప చేయించారని విమర్శించారు. అటువంటి మీరు పొదిలి ప్రాంతానికి వచ్చి ఏం ఉద్ధరిస్తారని, ఈ ప్రాంత సమస్యలు ఎప్పుడైనా పట్టించుకున్నాడా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇన్చార్జిగా ఉంటూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా 85 కిలోమీటర్ల తారు రోడ్డు వేయించానన్నారు. మీరు అధికారంలో ఉండగా మీ ఎమ్మెల్యే కనీసం గుంతలు కూడా పూడ్చలేని స్థితిలో ఉన్న మీ నాయకుడికి పశ్చిమ ప్రాంతానికి వచ్చే అర్హత లేదని ఎద్దేవా చేశారు. పొగాకు గిట్టుబాటు ధర కోసం రైతులతో మాట్లాడడానికి వస్తున్న జగన్ పర్యటనను తాము ఖండిస్తున్నామన్నారు. వాస్తవాలు తెలియకుండా ప్రచార ఆర్భాటం కోసం వస్తున్నారని ఎమ్మెల్యే కందుల ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పొదిలి పర్యటనపై తీవ్రంగా విరుచుకుపడిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఈ యాత్రను 'దుర్దినం'గా అభివర్ణించారు. ఈ ప్రాంతానికి జగన్ ఎలాంటి మొహం పెట్టుకొని రావాలనుకుంటున్నారు? ఐదేళ్ల పాలనలో ఒక్కసారైనా రైతు కష్టాలను విన్నారా? అంటూ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు.

### వెలుగొండ ప్రాజెక్టుపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే

జగన్ పాలనలో వెలుగొండ ప్రాజెక్టు పేరుతో మోసం జరిగింది అని మండిపడ్డారు కందుల. "వెలుగొండ ప్రాజెక్టును పూర్తయిందని ప్రకటించి, అసలు నీళ్లు ఇచ్చారా? ఇంకా రూ.4000 కోట్ల పనులు మిగిలి ఉన్నాయి. మూడు సంవత్సరాలు పడే పని ఇలా మధ్యలో ప్రారంభించి ప్రజలను తప్పుదారి పట్టించడం జగన్ చేసిన అతి పెద్ద తప్పు" అని పేర్కొన్నారు.

### చంద్రబాబు పాలనలో ముందడుగు వేసిన అభివృద్ధి పనులు

జగన్ పరిపాలనలో మొక్కుబడి పనులు కూడా జరగలేదని విమర్శించిన ఎమ్మెల్యే కందుల, టీడీపీ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే పొదిలి ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు వివరించారు. "ఐసిడీఎస్ బిల్డింగ్‌లు, అంగన్వాడీల మరమ్మత్తులు, సిమెంట్ రోడ్ల నిర్మాణం సహా వివిధ పనులపై రూ.50 కోట్లు ఖర్చు పెట్టాం. ఇది మేము రైతుల కోసం చేస్తున్న కృషికి నిదర్శనం" అని చెప్పారు.

### పొగాకు రైతులకు నష్టమే!

జగన్ పర్యటన పొగాకు రైతులకు నష్టాన్ని కలిగించేదిగా ఉందని హెచ్చరించారు. "జగన్ వస్తున్నాడు అని విన్న వ్యాపారస్తులు కొనుగోళ్లలో మొండికేస్తే నష్టపోయేది రైతులే. ఇదే తీరుగా బర్లి పొగాకు కొనుగోలులో ప్రభుత్వ హస్తక్షేపంతో రైతులకు అండగా నిలిచాం. మిగిలిన పొగాకును కూడా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి కొనుగోలు చేయిస్తాం" అని హామీ ఇచ్చారు. పరిస్థితులను వాడుకుంటూ

### ప్రజల్ని మోసం చేయాలనే ప్రయత్నం

జగన్ పర్యటన రాజకీయ ప్రోపగాండాగా మిగలుతుందని, ఆయన మాటల్లో కనీస సత్యం లేదని ఎద్దేవా చేశారు. "రైతులను పరామర్శించటానికి వస్తున్నానంటారు. కానీ ఐదేళ్లలో వారి సమస్యల గురించి ఎప్పుడైనా ఆలోచించారా? మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం. తన కుటుంబం, దగ్గరపడి ముఠాల కోసం పాలన సాగించిన వ్యక్తి ఇప్పుడెందుకు ఈ ప్రాంతం పట్ల ప్రేమ చూపిస్తున్నాడు?" అని మండిపడ్డారు.

### మార్కాపురంను జిల్లాగా ఏర్పాటు చేస్తాం

జగన్ ప్రభుత్వంలో మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేయాలని పెద్ద ఎత్తున పోరాటం చేసినా పట్టించుకోలేదు. కానీ సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం త్వరలోనే మార్కాపురాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేయబోతోంది. ఇది ప్రజల సంకల్పానికి గౌరవం అని తెలిపారు.

### జగన్ పర్యటన వల్ల రైతులకు లాభం లేదు – నష్టమే

ఈయన పర్యటన వల్ల ఎటువంటి లాభం లేదని, రైతులకు మోసమే జరుగుతుందని ప్రజలకు స్పష్టంగా చెప్తున్నాం. ఇది ఒక దుర్దినం. మా ప్రభుత్వం మాత్రం రైతాంగానికి పూర్తి అండగా నిలుస్తుంది. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ముందుకు సాగుతుంది అని తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, పొదిలి ఏఎంసి ఛైర్మన్‌గా ఎంపికైన డాక్టర్ సయ్యద్ ఇమాంసా, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష, కొనకనమిట్ల మండల మాజీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మువ్వ కాటం రాజు, శివాలయం ప్రతిపాదిత ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, మాజీ శివాలయం కమిటీ అధ్యక్షులు సామంతపూడి నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, మాజీ వార్డు సభ్యులు జ్యోతి మల్లిఖార్జున, ముని శ్రీనివాసులు, మహిళా నేతలు సోమిశెట్టి శ్రీదేవి, మెహరున్నీసా, టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బ్లాక్ బెర్లీ పొగాకును ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది

**జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి**

**బ్లాక్ బెర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన చీరాల ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్య, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి**

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జూన్ 10)

బ్లాక్ బెర్లీ పొగాకును ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ప్రకటించారు. చీరాల మండలం పేరాలలోని ఏపీ మార్క్ ఫెడ్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములో నూతనంగా ఏర్పాటు చేసిన బ్లాక్ బెర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వెంకట మురళి, చీరాల ఎమ్మెల్యే ఎం.మాల కొండయ్య కలిసి రిబ్బన్ కత్తిరించి మంగళవారం ప్రారంభించారు. నష్టపోతున్న రైతులను ఆదుకోవడానికే ఏపీ మార్క్ ఫెడ్ ని ప్రభుత్వం రంగంలోకి దించిందని కలెక్టర్ చెప్పారు. కంపెనీల మాటలు నమ్మి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలోని రైతులు బ్లాక్ బెర్లీ పొగాకును సాగు చేసి మోసపోయారన్నారు. అలాంటి రైతుల (తరువాయి 4లో...)

# జగన్ పర్యటనకు సర్వం సిద్ధం



**ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించిన జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు**

**నాలుగు ప్రాంతాల్లో భోజనాలు ఏర్పాటు**

**జగన్‌ను చూసేందుకు భారీగా తరలిరానున్న ప్రజానీకం**

**ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు**

**భారీ బందోబస్తు ఏర్పాటు**

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 10)

పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వారిని నేరుగా కలిసి తెలుసుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేడు పొదిలికి రానున్నారు. ఈ నేపథ్యంలో గత నాలుగు (తరువాయి 4లో...)

# పేదల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

**పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి**

**50 వేల మందికి పైగా సీఎంఆర్‌ఎఫ్ నుంచి ఆర్థిక సాయం**

**రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్**

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూన్ 10)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేస్తుందని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. ముందుగా అద్దంకి పట్టణంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి గొట్టిపాటి, జిల్లా కలెక్టర్ వెంకట మురళి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మీడియాతో మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నియోజకవర్గంలో ఐదు ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పేందుకు అనుమతి ఇచ్చినట్లు గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. అద్దంకి పట్టణ పరిధిలో సుమారు రూ.1.50 కోట్లు వెచ్చించి ఆసుపత్రిని నిర్మించినట్లు చెప్పారు. ఈ నెలాఖరుకి నియోజకవర్గం పరిధిలోని మరో 4 ఆరోగ్య కేంద్రాలను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గం ప్రజల కోరిక మేరకు మేదరమెట్లలో త్వరలోనే డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని తెలిపిన మంత్రి.. గడిచిన ఏడాదిలో కాలంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50,000 మందికి పైగా ఆర్థిక సాయం పొందారని మంత్రి పేర్కొన్నారు. అద్దంకి నియోజకవర్గంలో 700 మందికి పైగా సీఎంఆర్‌ఎఫ్ తో లబ్ధిపొందారని మంత్రి గుర్తు చేశారు. అనంతరం అద్దంకి మండలం గోవాడ గ్రామ పరిధిలో నామ్ రోడ్డు నుంచి గోవాడ గ్రామానికి రూ. 1.20 కోట్ల వ్యయంతో కొత్త నిర్మించిన తారు రోడ్డును మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రారంభించారు. తొలి దశలో రూ.6కోట్ల వ్యయంతో నియోజకవర్గంలో రోడ్లు వేశామని, మరో రూ. 7.5 కోట్లతో రెండో దశలో రహదారుల వేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కేంద్ర నిధులను వైసీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని మంత్రి గొట్టిపాటి ఆరోపించారు. పనికి ఆహార పథకం కింద వచ్చే నిధులను కూడా పక్కదారి పట్టించారని ఆయన వాపోయారు. అన్ని ప్రాంతాలకు తాగునీట సరఫరా, రోడ్ల నిర్మాణం, మరమత్తులతో (తరువాయి 4లో...)



# బ్లాక్ బెర్లీ పొగాకును ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది



క్షేమాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని బ్లాక్ బెర్లీ పొగాకును కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం చీరాల, పర్చూరు మండలాలలో రెండు కేంద్రాలను ప్రారంభించామన్నారు. మరో మూడు కేంద్రాలు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల వద్ద 7.48 లక్షల క్వింటాళ్ల పొగాకు ఉన్నట్లు గుర్తించామన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా 1.48 లక్షల క్వింటాళ్ల పొగాకును కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 16 నుంచి విస్తృతంగా పొగాకు కొనుగోలు చేపడుతామన్నారు. మార్క్ ఫెడ్ తోపాటు ఇతర కంపెనీలు కొనుగోలు చేసేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన పొగాకును ప్రాసెసింగ్ చేసి ఏడాది వరకు నిల్వ ఉంచేలా ఏర్పాట్లు చేశామన్నారు. వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములను ఇందుకోసం వినియోగిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో రైతులు ఇలాంటి పరిస్థితులతో ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపేలా అవగాహన కల్పిస్తామన్నారు. బాపట్ల జిల్లా పరిధిలోని భూముల పరిస్థితులు, భూసారం ఆధారంగా ఎలాంటి పంటలు వేయాలో పరీక్షించి చర్యలు తీసుకుంటా మన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను గుర్తించి మొక్కజొన్న, శనగ, వేరుశెనగ వంటి పంటలను సాగు చేసేలా వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ ఏడాది జూలై నెలలోనే కృష్ణా పశ్చిమ డెల్టా, ఎన్ఎస్పి నీరు విడుదల కానుందన్నారు. ఆ దిశగా పంటలు సాగు చేసుకునేలా రైతులను చైతన్య పరుస్తామన్నారు. పొగాకు రైతులను ఆదుకుంటాం, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని చీరాల శాసనసభ్యులు ఎం.మాలకొండయ్య తెలిపారు. బ్లాక్ బెర్లీ పొగాకుకు గత ఏడాది క్వింటా ధర రూ.17 వేలు పలికిందని, ప్రస్తుతం రూ.7000 లకు దిగజారటంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. కంపెనీల మాట విని పొగాకు పంటను అధికంగా ఉత్పత్తి చేయడంతోనే





ఈ సమస్య ఎదురయ్యిందన్నారు. రైతుల ఇబ్బందులను తొలగించడానికే మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పొగాకును కొనుగోలు చేయడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిఎం కరుణశ్రీ, ఆర్డీవో చంద్రశేఖర్, తహసీల్దార్ గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# పేదల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం

పాటు మొత్తం 175 నియోజకవర్గాల పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందన్నారు. అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మరింత ప్రోత్సహించడానికే... షైనింగ్ స్టార్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిపివేసిన అభివృద్ధి పనులన్నింటినీ మరలా ప్రారంభించి పూర్తి చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా వివరించారు. అనంతరం కొటికలపూడి పంచాయితీ, పార్వతీపురం గ్రామ పరిధిలో జల జీవన్ మిషన్ కింద సురక్షిత మంచినీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి స్థానికులతో ఆత్మీయ సంభాషణ చేశారు. పలు అంశాలను ప్రజల వద్ద ప్రస్తావించారు.

**సామాన్యులకు పెద్ద పీట వేస్తూ..**
**ప్రజలతో మమేకమవుతున్న మంత్రి గొట్టిపాటి**

సామాన్యులకు పెద్ద పీట వేస్తూ రాజకీయ పార్టీలకు అతీతంగా పల్నాడు ప్రాంతం ప్రజల్లో తనకంటూ ఒక సొంత బ్రాండ్ క్రియేట్ చేసుకున్న ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాల్లోనూ తన మార్కు చూపిస్తున్నారు. సామాన్యులకు పెద్ద పీట వేస్తూ కోట్లాది రూపాయిల అభివృద్ధి పనులను కూడా వారితోనే ప్రారంభం చేయిస్తూ, ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారు. ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల అవసరాలను తీర్చుతున్నారు. అందుకే పల్నాడు ప్రాంత ప్రజలు కూడా తమ అభిమాన నేతను గుండెల్లో పెట్టుకుని ఆరాధిస్తున్నారు.







# జగన్ పర్యటనకు సర్వం సిద్ధం





రోజులుగా వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, కుందురు నాగార్జునరెడ్డి, మాజీ మైన్స్ కార్పొరేషన్ డైరక్టర్ కెవి రమణారెడ్డి ఇతర నాయకులు అను నిత్యం ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. బుధవారం జగన్ పర్యటనకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పార్టీ తరుపున అన్ని ఏర్పాట్లను అన్నా రాంబాబు స్వయంగా పర్యవేక్షించారు. పొదిలి పట్టణంలోని చర్చి సెంటర్ వద్ద, పోలీస్ సర్కిల్ కార్యాలయం పక్కన, దర్శి రోడ్డులో గల ఆర్టీసి స్థలం, అదే రోడ్డులో శ్రీ మంజునాథ ఎసి ఫంక్షన్ హాలు ఎదురు ఖాళీ స్థలంలో జగన్ ను చూసేందుకు వచ్చే ప్రజలకు భోజన వసతులు ఏర్పాటు చేశారు. ఎండ వేడిమిని దృష్టిలో ఉంచుకుని మంచి నీటి వసతి కూడా ఏర్పాటు చేశారు. జగన్ పర్యటనను విజయవంతం చేసేందుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా జన సమీకరణ చేశారు. మంగళవారం స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాల నందు వైసీపీ ముఖ్య నేతలంతా జగన్ పర్యటన విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా ముచ్చటించారు. హెలిప్యాడ్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనాల పార్కింగ్ సౌకర్యం, ప్రోటోకాల్ తదితర విషయాలపై కూడా వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైసీపీ పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గోలమారి చెన్నారెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి, పొదిలి, కొనకనమిట్ల, దర్శి, మర్రిపూడి మండలాలకు చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పటిష్టంగా చేపట్టాలి

ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ల కు సూచించారు. మంగళవారం విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, వర్చువల్‌గా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశమై పిజిఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తుల పెండెన్సి, ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్, ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీమతి జయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాల్లో పిజిఆర్ఎస్‌లో రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా దరఖాస్తులను, సమస్యలను పెండింగ్ లో లేకుండా సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి అర్హులైన లబ్దిదారుల వివరాలను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటిపట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఒంగోలు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వర కుమార్, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ భాషా, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరావు, ల్యాండ్ సెక్షన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

## రాష్ట్రవ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాలపై
# దాడులు అప్రజాస్వామికం

ఇది శాంతిభద్రతల పూర్తి వైఫల్యమని అన్నారు.టీడీపీ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, ప్రజా భద్రతను నాశనం చేసిందని కూడా ఆయన ఆరోపించారు. "ఓట్లు దక్కించుకోవడానికి 'సూపర్ సిక్స్', 'సూపర్ సెవెన్' వంటి బూటకపు హామీలిచ్చారు, కానీ అధికారంలోకి వచ్చాక ప్రతీ హామీని మోసం చేశారు. ప్రజలు ఇప్పుడు మిమ్మల్ని విఫలమైన, అవినీతిపరుడైన, అసమర్థ ముఖ్యమంత్రిగా చూస్తున్నారు" అని జగన్ విమర్శించారు.జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి చంద్రబాబు ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలు, మీడియా మానిప్యులేషన్‌ను ఉపయోగించి అబద్ధాలు ప్రచారం చేస్తూ, ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని జగన్ ఆరోపించారు. "చంద్రబాబు గారూ, మీ డైవర్షన్ పాలిటిక్స్ ఎప్పటికీ పనిచేయవు. ప్రజలు గమనిస్తున్నారు, వారు మిమ్మల్ని నిలదీస్తారు" అని ఆయన హెచ్చరించారు.

# విభేదాలు సృష్టించేందుకు వైకాపా కుట్ర

నిలిచిన మంజులారెడ్డి, మెడపై కత్తిపెట్టి వాళ్ల నాయకుడి పేరు చెప్పమన్నా భయపడకుండా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అని నినదించిన తోట చంద్రయ్యలే తనకు స్ఫూర్తి అని పేర్కొన్నారు.

**జులై ఒకటి నుంచి ప్రజల ముందుకు..**

వచ్చే నెల ఒకటి నుంచి ప్రజల ముందుకు వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తామని, నియోజకవర్గ పర్యటనలో ముందుగా కార్యకర్తలను కలుస్తామనే హామీని నిలబెట్టుకుంటున్నామని లోకేశ్ చెప్పారు. తెలుగుజాతి విశ్వఖ్యాతి, యువగళం, స్త్రీశక్తి, పేదల సేవలో సోషల్ రీ ఇంజినీరింగ్, అన్నదాతకు అండగా శాసనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ పార్టీలో వారికే పదవులు దానం నాగేందర్

పలు కార్యక్రమాల్లో దానం నాగేందర్ పాల్గొన్నారు. హిమాయత్‌నగర్‌లో సుమారు 60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం, ఆదర్శ్ నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో 150 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక న్యాయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ మంత్రివర్గ కూర్పును చేపట్టారని తెలిపారు. "గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో కూడా ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎస్సీ, బీసీ వారికి మంత్రివర్గంలో పెద్దపీట వేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆశయాలను, ఆయన ఆలోచనా విధానాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థవంతంగా ముందుకు తీసుకెళుతున్నారు" అని అన్నారు. జీహెచ్ఎంసీ పరిధి నుంచి ఎవరికైనా మంత్రి పదవి దక్కే అవకాశం ఉందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు దానం నాగేందర్ స్పందిస్తూ, దానికి ఇంకా సమయం ఉందని, అందరూ వేచి చూడాల్సి ఉంటుందని సూచించారు. మంత్రివర్గంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మంత్రులందరికీ ఆయన తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# ప్రజలే కేంద్రంగా పాలన

'సేవ' పేరుతో 'ఎక్స్' ద్వారా ఆయన పంచుకున్నారు. సమూల మార్పుల్ని అత్యంత వేగంగా, భారీ పరిమాణంలో తమ సర్కారు చేసి చూపించిందని తెలిపారు. 81 కోట్ల మందికి ఉచిత ఆహారధాన్యాలు, 15 కోట్ల మందికి కొళాయి కనెక్షన్లు, పేదల కోసం నాలుగు కోట్ల ఇళ్లను నిర్మించడం, దేశవ్యాప్తంగా 12 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం వంటివి ఆయన ప్రస్తావించారు. మంత్రిమండలిలో 60 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలవారే ఉన్నట్లు తెలిపారు. వీరికి ఈ స్థాయిలో పదవులు కేటాయించడం ఇదే తొలిసారి అని చెప్పారు.

**అన్ని రంగాలకు పెద్ద దెబ్బ: కాంగ్రెస్**

మోదీ 11 ఏళ్ల పాలన దేశ ప్రజాస్వామ్యానికి, ఆర్థిక రంగానికి, సామాజిక కూర్పునకు పెద్దదెబ్బ అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రాజ్యాంగంలోని ప్రతి పేజీకి ప్రభుత్వం నియంతృత్వాన్ని అద్దిందని తూర్పారబట్టారు. రాజ్యాంగ వ్యవస్థల్ని భాజపా-ఆరెస్సెస్ బలహీనపరిచాయని చెప్పారు. ప్రభుత్వం చెబుతున్న పథకాలన్నీ విఫలమయ్యాయన్నారు. వర్తమానం గురించి ప్రభుత్వం మాట్లాడటం మానేసి 2047పై కలల్లో విహరిస్తోందని లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ ఎద్దేవాచేశారు. 11 ఏళ్లలో మార్పు గానీ, జవాబుదారీతనం గానీ లేవని, కేవలం ప్రచారమే జరుగుతోందని విమర్శించారు.

# అనుమతులన్నీ ఇస్తున్నాం.. సకాలంలో పనులు జరగాల్సిందే

పనులు నెమ్మదిగా జరగడం, మరికొన్ని ప్రాజెక్టుల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉండటంపై సీఎం అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇకపై ఏ రహదారి నిర్మాణంలోనూ ఆలస్యం జరగకూడదని స్పష్టంచేశారు. ఎన్‌హెచ్ ప్రాజెక్టులకు భూసేకరణ, అటవీ, వన్యప్రాణి అనుమతులు తదితర సమస్యలను జులై నాటికి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పనుల వేగిరానికి ఉన్న ఆటంకాలేంటి? ప్రభుత్వపరంగా చేయాల్సిందేంటి అని ఆయా గుత్తేదారు సంస్థల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

**సమీక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఉన్నతాధికారులు**

**ఈ ఏడాది 1,040 కి.మీ. లక్ష్యం**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.20,067 కోట్లతో నిర్మిస్తున్న రూ.1,040 కి.మీ. ఎన్‌హెచ్‌లను పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), కేంద్ర రహదారులు, ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ (మోర్త్)లకు చెందిన 144 ప్రాజెక్టుల్లో కలిపి మొత్తంగా రూ.76,856 కోట్లతో 3,483 కి.మీ. మేర రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటన్నింటిలోనూ పురోగతి కనిపించాలని, ఇకపై ప్రతి మూణ్నెల్లకోసారి ప్రాజెక్టులవారీగా సమీక్షిస్తానని సీఎం పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.11,325 కోట్లతో 770 కి.మీ. మేర ఎన్‌హెచ్‌లు పూర్తయినట్లు అధికారులు వివరించారు.

**జులైకల్లా గుంతల్లేకుండా..**

రాష్ట్రంలోని ఆర్అండ్‌బీ రోడ్లలో 19,475 కి.మీ. మేర గుంతలు లేకుండా మరమ్మతులు చేశామని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. 'గుంతల రహిత రహదారుల మిషన్ కింద రూ.860.81 కోట్లతో ఈ పనులను గత నవంబరులో ప్రారంభించగా, ఇప్పటికే 97% పూర్తయ్యాయి. మిగిలిన పనులు జులై నాటికి పూర్తిచేస్తామ'ని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఈఎన్‌సీలు నయీముల్లా, రామచంద్ర, సీఈలు శ్రీనివాసరెడ్డి, వివేకానందరెడ్డి, ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి ఆర్కే సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# బెంగాల్‌లో సునీతా విలియమ్స్ మైనపు విగ్రహం

దీని తయారీకి నెలన్నర సమయం పట్టినట్లు ఆయన తెలిపారు. వ్యోమగాములు ధరించే సూట్ దొరక్కపోవడంతో విగ్రహావిష్కరణ కొంత ఆలస్యమైనట్లు పేర్కొన్నారు. దుస్తుల కోసం మొదట నాసాను సంప్రదించినప్పటికీ.. స్పందన లేకపోవడంతో ఆ తర్వాత ఓ స్నేహితుడి సాయంతో అమెరికా నుంచి తెప్పించినట్లు చెప్పారు. సునీతా విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో దాదాపు 9 నెలలు గడిపి, తర్వాత భూమిని చేరుకున్నప్పుడు.. ఆమె విగ్రహాన్ని తయారుచేయాలనే ఆలోచన వచ్చినట్లు సుశాంత రాయ్ తెలిపారు. సునీత విగ్రహాన్ని సుశాంత సొంత మ్యూజియంలోనే ప్రస్తుతం ఆవిష్కరించడం గమనార్హం.

# ఉగ్రవాదాన్ని ప్రపంచ సమస్యగా చూడాలి జైశంకర్

లక్సంబర్గ్‌లో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో బెల్జియం విదేశాంగ మంత్రి మాక్సిమ్ ప్రెవోట్ కూడా ఆయనతో ఉన్నారు. దేశ పురోగతి, సుసంపన్నతను కాపాడేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను జైశంకర్ వారికి వివరించారు.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత జరిగిన ఆపరేషన్ సిందూర్ పై ఆయన మాట్లాడుతూ 'నేరుగా విషయానికి వస్తే.. ఉగ్రవాదం నీది కాదు.. ఫలానా దేశానిది అని అనుకోవద్దు. మీడియా కూడా పక్షపాత ధోరణికి ఎప్పుడూ అతీతంగా ఉండలేదు. సాధారణంగా భారత్-పాకిస్థాన్ సమస్యను ద్వైపాక్షికంగా లేదా కశ్మీర్ అంశంగానే చూపుతుంది. వాస్తవానికి ఉగ్రవాద సమస్య ఇతర దేశాలకు వేరే విధంగా ఉంటుంది. ఈ కార్యకలాపాలను కొన్ని సంస్థలు నిర్వహిస్తాయి. కానీ, దేశ విధానంగా పెట్టుకొని నిర్వహించేవి ఉన్నాయి.

ఐరోపాలోని ప్రజలు దీనినే అర్థం చేసుకోవాలి. యూరప్‌లో కూడా ఉగ్రవాద ఘటనలు చోటు చేసుకొంటున్నాయి. కానీ, దానిని రెండు దేశాల మధ్య అంశంగా చూడరు. వారి పొరుగులోని ఏ దేశం ఉగ్రవాదాన్ని అధికారిక విధానంగా పెట్టుకోలేరు. ఇది ఏ రెండు దేశాలకు సంబంధించిన అంశమని అనుకోను. ఉగ్రవాదం కేవలం భారత్‌కు సంబంధించిన సమస్యే కాదు. గత 20-30 ఏళ్లుగా చూడండి.. చాలా ఉగ్రదాడుల మూలాల దర్యాప్తులు పాక్‌లోకి వచ్చి ఆగిపోతాయి" అని వ్యాఖ్యానించారు.

**టారిఫ్‌ల సస్పెన్షన్ ముగిసేలోపే అమెరికాతో ఒప్పందం..**

అంతకుముందు జైశంకర్ ఫ్రాన్స్‌లో పర్యటించారు. అమెరికా టారిఫ్‌లపై విధించిన సస్పెన్షన్ గడువు ముగిసేలోపు తాము ఆ దేశంతో ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకొంటామని ఫ్రాన్స్‌కు చెందిన ఓ లా ఫిగారోకు వెల్లడించారు. ఏప్రిల్ 2వ తేదీన భారత్‌పై అమెరికా 26శాతం టారిఫ్‌లు విధించింది. ఆ తర్వాత దానిని జులై9 వరకు సస్పెండ్ చేసింది. వాస్తవానికి ఏప్రిల్ 2 నాటికే ద్వైపాక్షిక చర్చలు తాము మొదలుపెట్టినట్లు వెల్లడించారు.

# వెన్నూరులో అంకమ్మ తల్లి తిరుణాళ్ల



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 10)

ప్రకాశం జిల్లా కొండపి మండలం వెన్నూరు గ్రామంలో వెలిసిన అంకమ్మ తల్లి తిరునాళ్ల రేపటి నుంచి ఐదు రోజులు అంగరంగ వైభవంగా జరుగుతుందని 15వ తేదీ అమ్మవారికి పొంగళ్ళు పెట్టుకొని భక్తులు ముక్కులు చెల్లించుకుంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారు ఆ రోజు ఒక అలంకరణలో భక్తులకి దర్శనం ఇస్తుందని, ఆలయ అర్చకులు తెలిపారు. కొండపి మండల ప్రజలందరూ తిరునాళ్ళల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు తీసుకోవాల్సిందిగా వెన్నూరు గ్రామస్తులు కోరుతున్నారు.

# లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాని కలిసిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)

ఢిల్లీలో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాని ఆయన కార్యాలయంలో మంగళవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పలు విషయాలపై వారు చర్చించారు.

# కందుకూరులో ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

## భారీగా పాల్గొన్న టీడీపీ నాయకులు, నందమూరి అభిమానులు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 10)

తెలుగు సినీ రంగంలో దిగ్గజ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే, పద్మభూషణ్ పురస్కార గ్రహీత నందమూరి బాలకృష్ణ జన్మదినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కందుకూరులో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నాయకులు, అభిమానులు వివిధ సేవా కార్యక్రమాలను అత్యంత ఉత్సాహంతో నిర్వహించారు.

**కేక్ కటింగ్ , ఉచిత భోజన వితరణ :** కందుకూరు పట్టణంలోని వెంకటనారాయణ బజార్‌లో ఉన్న అన్నా క్యాంటీన్ వద్ద ఉదయం 11 గంటలకు జన్మదిన కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, , బాలకృష్ణ అభిమానులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా, అన్నా క్యాంటీన్‌లో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా పేద ప్రజలకు ఉచిత భోజనం అందించారు.

**సామాజిక సేవలో బాలకృష్ణ ఆదర్శం :** ఈ కార్యక్రమంలో పాల్గొన్న అభిమానులు, టీడీపీ కార్యకర్తలు బాలకృష్ణ సినిమా, రాజకీయ, సామాజిక సేవా కృషిని కొనియాడారు. బాలకృష్ణ కేవలం సినిమా రంగంలోనే గాక, బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా అనేక మంది పేద రోగులకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ సమాజ సేవలో అసమానమైన కృషి చేస్తున్నారు.

ఆయన జీవితం మాకు స్ఫూర్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీనివాసరావు, షేక్ రఫీ, వడ్డెళ్ళ రవిచంద్ర, బెజవాడ ప్రసాద్ చిలకపాటి మధుబాబు, చుండూరి శ్రీను, ముచ్చు వేణు, మంగపాటి శ్రీనివాసరావు, పసుపులేటి రమణయ్య, కొత్తూరు వెంకట సుధాకర్, సవిడిబోయిన వెంకటకృష్ణ బాలకృష్ణ అభిమానులు కాకుమాని మాల్యాద్రి పిరతల బాలాజీ, వేముల లక్ష్మణ్, పచ్చవ నవీన్, అంజి, చేకూరి వీరాస్వామి కాకుమాని పేరయ్య, కోకిల ఖాదర్ బాషా, మధిర మధు, యర్రా మునలయ్య, మమ్ముషా, శేఖర్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు..


















# అమరావతి పై వైసీపీ చేస్తున్న విష ప్రచారం పై మహిళలు మండిపాటు

## తల్లి, చెల్లి విలువ తెలియని జగన్
## తప్పుడు ప్రచారం చేయిస్తున్నాడంటూ మహిళలు మండిపాటు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 10)

మూడు రోజుల క్రితం సాక్షి మీడియాలో అమరావతి రాజధాని మహిళల శీల హననం గురించి మాట్లాడటం జరిగింది. ఇటువంటి సాక్షి ఛానల్‌ని, సాక్షి పత్రిక ను తక్షణమే మూసివేయాలంటు కందుకూరు పట్టణంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని ర్యాలీ నిర్వాహించారు. ఎన్టీఆర్ సర్కిల్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు మహిళలు భారీగా నిర్వహించారు. అనంతరం సాక్షి దినపత్రికలను దహనం చేశారు. సాక్షి మీడియాను రాష్ట్రంలో నిషేధించాలంటూ మహిళలు నిరసన తెలిపారు.మహిళలకు జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధాని అమరావతిపై చౌకబారు విమర్శలు చేసిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, ముచ్చు శ్రీనివాసరావు, నాదెళ్ల వెంకటరమణయ్య, బెజవాడ ప్రసాద్, రవిచంద్ర, మహిళలు ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరు శైలజ, అల్లం సుమతి, కంసాని మయూరి, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# రోడ్డును ఆక్రమించిన బంకులు తొలగింపు








**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 10)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు పొదిలి పట్టణంలోని చిన్న బస్టాండ్ పరిసరాల్లో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన బంకులను మంగళవారం నగర పంచాయతీ కమిషనర్ కె ఎల్ నారాయణరెడ్డి తొలగించారు. అలాగే చిన్న బస్టాండ్‌లో హోర్డింగులు ఏర్పాటు చేసుకునేందుకు నాటిన కర్రలు, ఇనుప చువ్వలు పురపాలక సంఘం వారి నుంచి ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధం. అలాగే కర్రలు, ఇనుప చువ్వలు పాతవి అయినందున గాలి, వానకు బస్ కోసం వేచివున్న ప్రయాణికులు, పాదచారులు, వాహనదారుల పై పడే ప్రమాదం ఉన్నందున వాటిని వెంటనే తొలగించారు. చిన్న బస్‌స్టాండ్ ప్రాంతంలో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన బంకులను తొలగించమని అనేక పర్యాయాలు చెప్పిన సదరు యజమాని నుంచి ఎటువంటి స్పందన లేనందున చర్యలు తీసుకున్నారు. అలాగే చిన్న బస్టాండ్ నుండి పెద్ద బస్ స్టాండ్ మధ్యలో ఉన్న డ్రైన్‌లో పూడిక 20 ఏళ్ల క్రితం తీయడం వలన డ్రైన్ పూడికతో పూర్తిగా నిండి ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించి పూడిక తొలగించే పనులు చేపట్టడం జరిగిందన్నారు. పొదిలి పురపాలక సంఘం పరిధిలోని పెద్ద బస్టాండ్ ప్రక్కన పెద్ద వాగును ఆనుకొని 20 సంవత్సరాల క్రితం నిర్మించిన సామూహిక మరుగు దొడ్లను మహిళలకు, వృద్ధులకు, చిన్నపిల్లలకు, ప్రయాణికులకు, పాదచారులకు ఎంతో సౌకర్యంగా ఉన్న అలాంటి సామూహిక మరుగు దొడ్డిని కొంతమంది వ్యక్తులు రాత్రికి రాత్రి కూలగొట్టడం మూలాన వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి



గురవుతున్నారన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ విషయమై మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దృష్టికి అనేక పర్యాయములు వినతులు రావడం జరిగిందన్నారు. తదనుగుణంగా కమిషనర్ కి ఎన్ని ఇబ్బందులు వచ్చినా మరుగుదొడ్లను నిర్మించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు కమిషనర్ సదరు విషయాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లి వివరాలు సేకరించి మంగళవారం దానిని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ కోర్టు పరిధిలో వ్యాజ్యం ఉన్నందున కోర్టు వారు ఇచ్చే తుది తీర్పుకు అనుగుణంగా నడుచుకుంటామని తెలియచేశారు. ప్రస్తుతం ప్రజలు, వృద్ధులు, మహిళలు, ప్రయాణికులు, పాదచారులు, చిన్న పిల్లల సౌకర్యార్థం సామూహిక మరుగు దొడ్డిని నిర్మించ తలపెట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరం. అటువంటి వారి పై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఇలాంటి అక్రమార్కులను ఎటువంటి పరిస్థితుల్లో కూడా ఉపేక్షించ వద్దని ఆదేశించారన్నారు. పొదిలి పట్టణ అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేయవద్దని, పొదిలి ప్రజల సౌకర్యం, అభివృద్ధి విషయంలో ఎటువంటి రాజకీయ జోక్యం ఉండదని ఎమ్మెల్యే చెప్పారని కమిషనర్ తెలిపారు. పొదిలి పట్టణం అభివృద్ధి బాటలో నడవాలంటే ప్రజల సహకారం, మంచి సలహాలు తమకు అవసరమన్నారు. చిన్న బస్టాండ్ పరిసరాలలో ప్రజల సౌకర్యార్థం కొన్ని పనులు చేపట్ట వలసి వుందన్నారు. వాటిని కూడా త్వరలోనే కార్యరూపం దాల్చే లాగ చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించే విషయంలో గాని, అభివృద్ధి విషయంలో గాని కులం, మతం, ప్రాంత రాజకీయాలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారన్నారు. సామూహిక మరుగుదొడ్లను అక్రమంగా కూల్చిన వ్యక్తులను కమిషనర్ మున్సిపల్ కార్యాలయానికి పిలిపించి వారి డాక్యుమెంట్స్ పరిశీలించగా అవి తప్పుడు పత్రాలు, అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకొన్న విషయం వెలుగు చూసిందన్నారు. మీకు రిజిస్ట్రేషన్ చేసిన వారి పై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించి, ఇక పై ఇలాంటి వాటివి పునరావృతమైతే ఉపేక్షించేది లేదని కమిషనర్ తీవ్రంగా మందలించారు.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులను శిక్షించాలి

### మహిళా సంఘాల నాయకుల డిమాండ్





**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 10)**

రాజధాని అమరావతి ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వివిఆర్ కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్ రావు, ప్రసారం చేసిన సాక్షి టీవీ యాజమాన్యం వైయస్ భారతి పై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. దీనిలో భాగంగా మహిళలపై వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం వినుకొండ పట్నంలో మహిళలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్, మహిళా సంఘం నేత షేక్ షకీలా మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనను పారద్రోలి వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేసిన బుద్ధి రాలేదన్నారు. రాష్ట్రంలోని మహిళలను కించపరిచే విధంగా భారతిరెడ్డి తన ఛానల్‌లో చేయించిన అసభ్యకర వ్యాఖ్యలను సభ్య సమాజం ఖండిస్తుందన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్న సాక్షి పత్రిక ఛానల్ ను ప్రజలు బహిష్కరించాలని, అనుమతులను తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే వైశ్య అనే పదాన్ని శాశ్వతంగా తొలగించి, మహిళను వ్యక్తిగతంగా దూషణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మహిళలని కించపరిచే విధంగా ప్రసారం చేసిన సాక్షి మీడియా యాజమాన్యం వైయస్ భారతి, జగన్ రెడ్డిలు బెషరతుగా మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వినుకొండ తాసిల్దార్ సురేష్ నాయక్ కు మహిళలు వినతి పత్రం అందజేశారు. కూటమి మహిళలు పాల్గొన్నారు.

## వైభవంగా పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ళ



**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 10)**

జరుగుమల్లి మండలం కామేపల్లిలో వెలిసిన పోలేరమ్మ అమ్మవారి తిరుణాల బుధవారం నుండి శుక్రవారం వరకు మూడు రోజులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రాముఖ్యత కల్గిన ఈ అమ్మవారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొంటారని వారు తెలిపారు. కావున భక్తులందరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపాకటాక్షాన్ని పొందగలని కమిటీ సభ్యులు తెలిపారు.

## బదిలీపై వెళుతున్న సబ్ ట్రెజరీ అధికారి శ్రీ కృష్ణకు సన్మానం



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 10)**

మార్కాపురం సబ్ ట్రెజరీ అధికారి శ్రీ కృష్ణ బదిలీపై జిల్లా ట్రెజరీ కార్యాలయానికి వెళుతున్నందున మార్కాపురం మండల పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ సిబ్బంది, డివిజనల్ పంచాయతీ అధికారి సిబ్బంది కలసి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ మినిస్ట్రియల్ సంఘం నాయకులు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ సబ్ ట్రెజరీ అధికారిగా ఉద్యోగుల ఎన్నో సమస్యలను శ్రీ కృష్ణ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరించాలని రిటైర్డ్, ఫ్యామిలీ పెన్షనర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి దృష్టికి వచ్చిన వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేశారని అభినందనలు తెలిపారు.

## మద్యం అక్రమ విక్రయాలు, నాటు సారా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జూన్ 10)**

మద్యం అక్రమ విక్రయాలు, నాటు సారా నిర్మూలించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. నాటు సారా నిర్మూలనపై నవోదయం 2.0 అవగాహన కార్యక్రమాలపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. నాటు సారా తయారీని అధికారులు పూర్తి స్థాయిలో అరికట్టాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. మద్యం అక్రమ విక్రయాలు జరిగితే చర్యలు తీసుకోవాలన్నారు. గోవా నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న మద్యంను అరికట్టాలని సూచించారు. చాక్లెట్లు, ద్రవపదార్థాల రూపంలో గంజాయి విక్రయాలు జరిగితే సహించేది లేదన్నారు. చీరాల మండలంలో తొమ్మిది గ్రామాలు, నగరం మండలంలో ఐదు గ్రామాలు, బాపట్ల మండలంలో రెండు గ్రామాలు, రేపల్లె మండలాలలో ఒక గ్రామంలో నాటు సారా ఉత్పత్తులు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. 17 గ్రామాలలో 65 కుటుంబాలు రహస్యంగా నాటు సారా ఉత్పత్తి చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే గడిచిన నాలుగు నెలలలో 43 కేసులు నమోదయాయని, 29 మందిని అరెస్టు చేశామన్నారు. ఆ కుటుంబాల వారిని వృత్తి నుంచి మాన్పించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్ర మాలు చేపట్టాలన్నారు. ఆ కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాల వారికి పునరావాసం కల్పించి, డి అడిక్షన్ సెంటర్ల ద్వారా వైద్యం అందించాలన్నారు. ప్రజలలోనూ చైతన్యం తీసుకురావాలన్నారు. నాటు సారా ఉత్పత్తులను బాపట్లలో పూర్తిగా అరికట్టడానికి మండల, గ్రామస్థాయిలో కమిటీలు నియమించామన్నారు. ఈ కమిటీలు అత్యంత చురుగ్గా పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. మహిళా పోలీసులు, సచివాలయాల సిబ్బందిని కమిటీలలో చేర్చాలన్నారు. కళాజాతా బృందాలతో విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు ప్రజలలో నిర్వహించాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు లభిస్తాయని సూచించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ హేమంత్ నాగరాజు, ప్రొహిబిషన్ పర్యవేక్షణ అధికారి బి వెంకటేశ్వరరావు, కమిటీలోని వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ కూలీలు ఆందోళన



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జూన్ 10)**

హనుమంతునిపాడు మండలం హాజీపురం గ్రామ పరిధిలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో గత తొమ్మిదో వారాలుగా పని చేస్తున్న ఉపాధి కార్మికులు అర్ధాకలతో పనులు చేస్తున్నారని వెంటనే బిల్లులు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పని ప్రదేశంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. వీరు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో నిబంధనలను ప్రభుత్వమే దొంగలకు తొక్కుతుందని ఆరోపించారు. పని చేసిన ప్రతి కూలికి వారంలో చివర రోజు బిల్లు ఇవ్వాలని, చట్టం చెబుతుంటే గత మూడు నెలలుగా కూలీలతో పనిచేయుచుకుంటూ బిల్లులు చెల్లించకపోవడం అత్యంత దారుణమైన ఘటనగా వర్ణించారు కూలీలకు పని ఇచ్చి చేసిన పనికి డబ్బులు ఇవ్వకపోతే ఏం తిని బతకాలని ప్రశ్నించారు. గాలి వెళు తురుతూ కడుపు నింపే పథకం ఏదైనా కేంద్రం ఆలోచిస్తుందని వ్యంగంగా ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దలు తమకు సంబంధం లేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని కూలీల పట్ల దుర్మార్గమైన వివక్షను ప్రదర్శిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకానికి రెండు లక్షల కోట్లు కేటాయించాలని ప్రతికూలికి రోజు కనీసం రూ.600లు తగ్గకుండా ఇవ్వాలని ప్రతి జాబ్ కార్డుదారునికి రూ.200 రోజులు పనివ్వాలని, ప్రభుత్వమే ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం ఉపాధి కార్మికులందరికీ కల్పించాలని నినదించారు. మీట్లకు అదనపు పారితోషకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవస్థను పునరుద్ధరించి కూలీలందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తీవ్రమైన ఎండల్లో పని చేస్తున్న కూలీలకు సమ్మర్ అలవెన్స్, మజ్జిగ ,మంచినీళు ,, ట్రావెల్ అలవెన్స్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మేట్‌లు మన్నెం ప్రసాద్, గాయం రమేష్, సురసాని సుబ్బారెడ్డి,చిట్యాల ఆదిరెడ్డి, చిట్యాల తిరుపతయ్య, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ధారా రాజేష్ తోపాటు కూలీలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆలిండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)



జులై 15, 16 తేదీల్లో ఆలిండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతున్నా జయప్రదం చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఒంగోలు సిఐటియు కార్యాలయం ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్, ప్రకాశం జిల్లా విస్తృత సమావేశం సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి తంబి శ్రీనివాసులు అధ్యక్షత న జరిగింది. ఒంగోలులో జరుగుతున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కార్మిక వర్గాన్ని కోరారు. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత రవాణా రంగం చాలా కీలకమైన రంగం, రవాణా రంగానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంలో చాలా వివక్షత చూపుతుంది. రవాణా రంగంలో అనేక చట్టాలు తీసుకువచ్చి రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికుల జీవన విధానాన్ని మార్చే విధంగా చట్టాలు వస్తా ఉన్నాయి. 2024 డిసెంబర్లో బిఎన్ఎస్ చట్టం ఆమోదం పొందింది. 2025 ఏప్రిల్ తర్వాత ఎన్నికల తర్వాత ఆ చట్టాన్ని అమల్లోకి తీసుకు రావడం జరిగింది. ఆ చట్టం వచ్చిన తర్వాత రవాణా కార్మికుల్లో శిక్షలు పడటం, జరిమాణాలు విధించడం ఈ విధమైనటువంటి ధోరణి దేశవ్యాప్తంగా పెరుగింది. దీని వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ పోరాటాలు నిర్వహించిన ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుంది. అయినప్పటికీ దొడ్డి దారిన చట్టాలు అమలు చేసే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తా ఉంది. ఈ విధానాల్ని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఖండిస్తుంది. అలానే రమణారంగ కార్మికులకి ఎలాంటి కార్మిక చట్టాలు లేవు కేశవ్యాప్తంగా 10 కోట్ల మంది కార్మికులు ఈ రంగంపై ఆధారపడి జీవనం చేస్తా ఉన్నారు. కార్మిక చట్టాలు అమలు జరగని కారణంగా అనేక విధాలుగా కార్మికులు నష్టపోతున్నారు. రెండో ప్రక్క కేరళలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రతి వర్కర్ నుంచి మినిమం పందు వసూలు చేసి కార్మికులకి ఉద్యోగులకి అనుకూలమైన పద్ధతుల్లో సంక్షేమ చట్టం కేరళలో అమలవుతాం. ఇలాంటి చట్టాన్ని దేశవ్యాప్తంగా తీసుకోరావాలని చెప్పి ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని అనేక దఫాలుగా కోరడమైనది. అర్జీల రూపంలో దశ వ్యాప్తంగా ఉన్న పార్లమెంట్ సభ్యులను కూడా కలిసి ఈ చట్టాల్లో ఉన్నటువంటి లోపాలు ఏంటి మంచి ,చెడు రవాణా కార్మికులకు ఉపయోగపడే విధంగా చట్టాలు తీసుకురావాలని మాట్లాడింది. జీవో నెంబర్ 21 తీసుకువచ్చి రవాణా కార్మికుల మీద చలానాలు, జరిమానాలు, శిక్షలు పెరిగే విధంగా ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం చేస్తా ఉంది. ప్రతి మూడు మసాలాలకు ఒకసారి లారీ కార్మికులకి త్రైమాస్క పన్నులు పెంచడం జరుగుతోంది. పన్నులు పెంచడం వల్ల లారీ కార్మికులు , లారీ యజమానులు తీవ్రమైన నష్టానికి గురవుతున్న పరిస్థితి మనం చూస్తా ఉన్నాం లారీలు రోడ్లమీద నడపలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు ఒంగోలు లో నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించారు. ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆల్ ఇండియా మహాసభలు జూలై 29, 30, 31 తేదీల్లో త్రివేండ్రంలో జరుగుతున్నాయి. ఈ జరిగే మహాసభలు ఖర్చుతో కూడుకున్నటువంటి మహాసభలుగా ఉన్నాయి. ఈ మహాసభలకి ప్రకాశం జిల్లాలోని ఉద్యోగులు కార్మికులందరూ కూడా దీనికి సపోర్టుగా ఉండే మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ జూలై 9న జరిగేటటువంటి సమ్మెలో దేశవ్యాప్తంగా ఉద్యోగులు కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా లేబర్ కోడ్స్ని వ్యతిరేకిస్తూ ఈ సమ్మె జరుగుతు ఉంది. ఒకపక్క లేబర్ కోడ్స్ ను వ్యతిరేకిస్తూ పోరాటాలు జరుగుతూ ఉంటే మరో ప్రక్క రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది గంటల దినాన్ని 10 గంటల దినంగా మార్చటం , రాత్రిపూట మహిళలు చేత పని చేయించడం ఇలాంటి దుర్మార్గమైన చట్టాల్ని తీసుకురావడం జరుగుతా ఉంది. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తే తప్ప ఈ లేబర్ కోడ్స్ వెనక్కి వెళ్లవు అనేది సుబ్బారావు తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత మహాసభలు 2025 డిసెంబర్ 31 ప్రారంభమై 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నం మన రాష్ట్రంలో జరుగుతున్నాయి. ఈ అఖిలభారత మహాసభల్లో రవాణా రంగం పాత్ర ఒక కీలకమైన పాత్రగా ఉండాలని రమేష్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యం.అయ్యపరెడ్డి మాట్లాడుతూ నిజ వేతనాలు , ధరలు వీటి ఫలితంగా రవాణా కార్మికులకు వస్తున్న ఆదాయాన్ని పరిశీలన చేస్తే చాలా దుర్భర పరిస్థితిలో రవాణా కార్మికులు ఉన్నారు. అలానే కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగానికి సరైన నిధులు కేటాయించకుండా ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పి విధంగా విధానాలు ఉన్నాయని తెలిపారు. విధానాలు తిరస్కరించాలని, కార్మిక వర్గాన్ని కోరారు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ మహసభల నిర్వహణకు సిఐటియు తోడ్పాటు నందిస్తుందని తెలిపారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో టోల్ ప్లాజా కార్మికుల బకాయిల కోసం జనవరి నుంచి మే నెల వరకు పోరాటం చేసి విజయాన్ని సాధించడం జరిగింది. జిల్లాలో పర్మినెంట్ స్టాండ్ కోసం పోరాడాం, పోలీసులు , అధికారులు వేధింపులకు వ్యతిరేకంగా ఈ జిల్లాలో ఉద్యమించిన సంగతి శ్రీనివాసులు ప్రస్తావించడం జరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర మహాసభలు తమదైనదిగా భావించి ఆర్థిక తోడ్పాటు నందించి మహాసభలను జయప్రదం చేయాలని శ్రీనివాసులు కోరారు. సమావేశంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు అల్లడి సుబ్బారావు , మహమ్మద్ హుస్సేన్ , పిచ్చిరెడ్డి , బ్రహ్మయ్య , మహేష్ ,కాశీ విశ్వనాథం , కోటేశ్వరరావు ,సయ్యద్ మున్నాబాష తదితరులు ఈ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అనంతరం మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆహ్వాన సంఘంతో పాటు మహాసభల నిర్వహణకు అనేక కమిటీలు వేసి రేపట్నుంచి పనిలోకి వెళ్లాలని చెప్పి నిర్ణయం తీసుకున్నారు. ఈ జిల్లాలోని ప్రముఖులంతా ముఖ్యులంతా ఆహ్వాన కమిటీ లో ఉన్నారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని చెప్పి శ్రీనివాసులు అందరినీ కోరారు.

# మద్యం మత్తులో వాహనం నడిపితే చర్యలు

## ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్

### ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలి

### మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 23 మందికి జరిమానా విధించిన ఒంగోలు కోర్ట్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై గట్టి చర్యలు తీసుకుంటున్నారు. అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో బ్రీతింగ్ ఎనలైజర్‌తో పరీక్షలు చేసి డ్రంకన్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసినారు. ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 23 మందిని మంగళవారం ఒంగోలు కోర్టు వారి ముందు హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.10,000 జరిమానా విధించారు. (మొత్తం రూ. 2,30,000 జరిమానా). మద్యం మత్తులో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురైతే తీవ్రంగా గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం లాంటివి జరిగి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని, మీ మీద ఆధారపడే కుటుంబ సభ్యులు రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్స్ రూల్స్ పాటించాలని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రమాదాల నివారణకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో బ్లాక్ స్పాట్స్, ఆక్సిడెంట్ ప్రోన్ ఏరియాల వద్దల సైన్, జాగ్రత్త బోర్డులు, రేడియం పెయింటింగ్స్, స్టిక్కరింగ్, స్పీడ్ బ్రేకర్స్‌లను ఏర్పాటు చేశామని, నో హెల్మెంట్, సీటు బెల్టు ధరించక పోవటం, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ లోడింగ్ డ్రంకన్ డ్రైవింగ్ వలన కలిగే ప్రమాదాల గురించి వాహనదారులకు వివరిస్తూ రోడ్డు భద్రతా ప్రమాణాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పలువురికి జైలు

## ఎస్ఐ రవీంద్రారెడ్డి

(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, జూన్ 10)

మండల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులో ఐదుగురుని గిద్దలూరు కోర్టులో



హాజరుపరచగా, అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్ డీక్లాస్ న్యాయమూర్తి కె భరత్ చంద్ర డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఐదుగురిలో ముగ్గురికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించడంతో పాటు ఒకరికి రెండు రోజులు , మరొకరికి ఐదు రోజులు జైలు శిక్ష విధించినట్లు బేస్తవారిపేట సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్వీ రవీంద్రారెడ్డి తెలిపారు. అలాగే ఆరు నెలల వరకు ఎలాంటి వాహనాలు నడపకుండా లైసెన్స్‌ను రద్దు చేస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెల్లడించారు.

# నేడు తల్లి, నవ జాత శిశువు విభాగం ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)

ఈ నెల 11వ తేదీ జీజీహెచ్‌లో తల్లి, నవ జాత శిశువు విభాగాన్ని (కంగారు మదర్ కేర్) ను రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియాల ప్రత్యేక చొరవతో ఆధునికీకరించిన వార్డులను ప్రారంభించనున్నారు. 11న సాయంత్రం 3:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని జీజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ ఏడుకొండలరావు తెలిపారు.

# టైలరింగ్ వృత్తి చాలా ఉన్నతమైంది

## ఏపీ టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)

ఒంగోలు నెహ్రూనగర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ టైలరింగ్ కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఏపీ టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి సందర్శించారు. సుమారు 250 మంది ఈ శిక్షణ కేంద్రంలో కుట్టు మిషన్‌పై శిక్షణ పొందుతున్నారు. చైర్మన్ ఆకాశపు స్వామి మాట్లాడుతూ టైలరింగ్ వృత్తి చాలా ఉన్నతమైందన్నారు. మనిషిని అందంగాను తీర్చిదిద్దేది ఒక టైలర్‌నేనని అన్నారు. శిక్షణ పొందుతున్న మహిళలకు సూచనలు ఇచ్చారు. శ్రద్ధతో నేర్చుకుని ప్రతి ఒక్కరు వారి స్వయం శక్తితో నిలబడాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త ఉండాలనే ధ్యేయంతో ఇలాంటివి శిక్షణ తరగతులు ముందుకు తీసుకెళుతున్నారు. ఈ ప్రభుత్వం మహిళా ఉపాధికి కట్టుబడి ఉందన్నారు. హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ బీసీ మంత్రి ఎస్.సవితమ్మ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టైలరింగ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# ఆటో, రవాణా రంగ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)

ఆంధ్రప్రదేశ్‌లో సంవత్సరం క్రితం అధికారంలో కూర్చున్న కూటమి ప్రభుత్వం ఆటో రవాణా రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరుతూ మంగళవారం నాడు ఒంగోలులోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో ఉప రవాణా కమిషనర్ సుశీలకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ మోహన్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా తాము అధికారంలోకి వస్తే ఆటో మోటారు రవాణాకార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, జీవో నెంబర్ 21 రద్దు చేస్తామని, ప్రతి డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.15,000లు వాహన మిత్ర పథకం కింద ఇస్తామని, ఐదు శాతం వడ్డీలకు ఆటో డ్రైవర్లకు ఆటోలు కొనుగోలు చేసేందుకు నాలుగు లక్షల రూపాయలు రాయితీతో రుణాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిపోయినా ఇంతవరకు రవాణా రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ప్రధానంగా ఆటో, రవాణా రంగ కార్మికులపై భారీ పెనాల్టీలు వేసే జీవో నెంబర్ 21 రద్దు చేయలేదని తెలిపారు. రవాణా ఆటో కార్మికులకు 15వేల రూపాయలు వారి అకౌంట్లో జమ చేయలేదన్నారు. అందువలన రాష్ట్ర ప్రభుత్వం ఆటో రవాణా రంగ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం, ఐయఫ్‌టియు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు చెరదల మోజేష్, పాలకీర్తి కొండలు, సుధాకర్, సాంసన్, పిడిఎస్‌యూ నేత రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.






# దివ్యాంగులకు బ్యాక్ లాగ్ ఉద్యోగాల ఉత్తర్వులు అందజేత







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)

స్థానిక కలెక్టర్ కార్యాలయంలో 16 మంది దివ్యాంగులకు 2021-22 గ్రూప్-4 అంధుల విభాగంలో జూనియర్ అసిస్టెంట్ :2 పోస్టులకు మాట్రన్ కం స్టోర్ కీపర్: 1 పోస్టునకు, 2022-23 సంవత్సరానికి గాను గ్రూప్ 4 విభాగంలో బదిరులకు 1 జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ , టెక్నికల్ పోస్టు పోస్టులకు , క్లాసు-4పోస్టుల విభాగంలో 10 పోస్టుల కు అంధుల విభాగంలో ఆఫీస్ సబ్ ఆర్డినేట్: 2 పోస్టులకు, వాచ్ మెన్: 2 , సేవిక: 1, బదిరుల విభాగంలో ఆఫీస్ సబ్ ఆర్డినేట్: 1 పోస్టు మరియు శారీరక అంగ వైకల్యం విభాగంలో ఆఫీస్ సబ్ ఆర్డినేట్: 1 పోస్టు, కామాటి: 1 పోస్టునకు జిల్లా కలెక్టర్ నియామకాలను అభ్యర్థులకు ఉత్తర్వులు జారీ చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కొండపి సీడీపీవోగా సుశీల దేవి





(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 10)

సాధారణ బదిలీల్లో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అంగన్‌వాడీ కొండపి మండల నూతన సిడిపిఓగా సుశీల దేవి బాధ్యతల స్వీకరించారు. ఇంతకుముందు పనిచేసిన సిడిపిఓ మాధవిలత ఉలవపాడుకి బదిలీ అయ్యారు. మార్కాపురంలో పనిచేస్తున్న సుశీల దేవి కొండపికి బదిలీ అయ్యారు. ఇంతకుముందు కొండపి సిడిపివోగా పనిచేసిన అనుభవం సుశీల దేవికి ఉన్నందున కొండపి మండల పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లని అభివృద్ధి పథంలో నడిపిస్తానని సుశీల దేవి అన్నారు.

# చిల్డ్రన్స్ క్లబ్స్‌తో పిల్లలకు ఉపయోగం

## బాలోత్సవ కమిటీ నాయకులు వి బాలకోటయ్య

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)

మానసిక ఉల్లాసానికి, సృజనాత్మకతను పెంపొందించడానికి బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే చిల్డ్రన్స్ క్లబ్స్ పిల్లలకు బాగా ఉపయోగపడతాయని బాలోత్సవ కమిటీ నాయకులు వి బాలకోటయ్య అన్నారు . మంగళవారం ఒంగోలు చైతన్య కాలనీలో నిర్వహించిన చిల్డ్రన్స్ క్లబ్ ముగింపు కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ పిల్లలు మానసికంగా సృజనాత్మకంగా ఆలోచించడానికి పరిసర ప్రాంతాల్లో జరుగుతున్నటువంటి విషయాల్ని ఆలోచింపజేసే విధంగా చిల్డ్రన్స్ క్లబ్ ఆటలు, పాటలు ,బొమ్మలు, డాన్సులు, మ్యాజిక్ రకరకాల రూపాలలో అనేక విషయాలపై అవగాహన కలిగే విధంగా కార్యక్రమాలు రూపొందించి నేర్పించడం అభినందించదగ్గ విషయమన్నారు. వీటిని విస్తృతంగా నిర్వహించడం వల్ల అనేక విషయాలను పిల్లల ద్వారా తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎక్కువ కేంద్రాల్లో నడిపేందుకు కృషి చేయాలన్నారు. మహిళా సంఘం నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ పిల్లలు ఉత్సాహంగా ఇక్కడ నేర్పే అన్నిటిని నేర్చుకొని చివరి రోజు ప్రదర్శనలకి పెట్టడం బాగుంది అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులుగా సమాజంలో జరుగుతున్న అసమానతలు లైంగిక వేధింపులు ఇతర వ్యసనాల నుంచి యువతని దూరం చేయటం వంటి అంశాలపై చైతన్యం తీసుకురావటం సులువుగా ఉంటుందన్నారు. సమాజాన్ని మార్చే ప్రయత్నంలో భాగంగా పిల్లల స్థాయిలోనే అనే అంశాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలను సక్రమైన మార్గంలో నడిపిస్తూ వారికి నాణ్యమైన విద్య ఉపాధి కోసం మా సంఘం పనిచేస్తుందన్నారు. అందులో భాగంగా చిన్నపిల్లలకు అర్థం చేసుకునే పద్ధతిలో ఈ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం ఈ శిక్షణకు హాజరైన పిల్లలకు పెన్నులు, నోట్ బుక్స్ ఇవ్వడం జరిగింది.



# ప్రభుత్వాలు మారినా...

# మారనవి ఎన్టీఆర్ పథకాలు మాత్రమే

### తెలుగువారి ఆత్మ గౌరవానికి ఎన్టీఆర్ కృషి చేశారు

### రాష్ట్ర అభ్యున్నతికి చంద్రబాబు కష్టపడుతున్నారు

### జగన్ ఉంటే ఇంట్లో చెదలు, వ్యవసాయంలో పరుగులు ఉన్నట్లే

### ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూన్ 10)

ప్రభుత్వాలు మారినా... తరాలు మారినా... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మారనవి నందమూరి తారక రామారావు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు మాత్రమే అని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకి మండలం పార్వతీపురంలో మంగళవారం తెలుగుదేశం వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవం కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం అన్నారు. నాడు తెలుగువారి ఆత్మ గౌరవం కోసం ఎన్టీఆర్ కృషి చేస్తే, నేడు తెలుగు వారి అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు నాయుడు కష్ట పడుతున్నారని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. తెలుగు ప్రజల తలసరి ఆదాయం పెంచే దిశంగా సీఎం చంద్రబాబు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా రన్నారు. చంద్రబాబు విజన్-2020తోనే గ్రామాల్లోనూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పుట్టుకొచ్చారని మంత్రి గుర్తు చేశారు. విజన్ 2047పై జగన్ చేస్తున్న విమర్శలకు ప్రజలే సమాధానం చెబుతారని తెలిపారు. గడిచిన 43 సంవత్సరాలుగా టీడీపీని నాశనం చేయాలని ఎందరో, ఎన్నో ప్రయత్నాలు చేసినా అన్ని ఆటుపోట్లకు ఎదురొడ్డి టీడీపీ నిలబడిందని వ్యాఖ్యానించారు. టీడీపీ సిద్ధంతాలు ఎప్పటికీ బతికే ఉంటాయని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా తెలిపారు.





#### వేల ఎకరాలు త్యాగం చేసిన వారిని...

33 వేల ఎకరాలను త్యాగం చేసిన రాజధాని మహిళలను జగన్ మీడియా, జగన్ పార్టీ అనరాని మాటలు అందని మంత్రి గొట్టిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పార్టీ సమాజంలో ఉంటే ఇంట్లో చదలు పట్టినట్లే అని చెప్పారు. వ్యవసాయానికి పురుగు పడితే ఎంత నష్టమో... జగన్ వల్ల ఈ రాష్ట్రానికి కూడా అంతే నష్టం జరుగుతుందని వివరించారు. మహిళలను గౌరవించడం కూడా తెలియని పార్టీలు రాజకీయాలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎంత విధ్వంసం జరిగిందో.. ప్రజలు ఎంత నష్ట పోయారో అందరూ చూశారన్నారు. కూటమి ప్రభుత్వంలో కుల, మతాలకు అతీతంగా అందరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారని గొట్టిపాటి తెలిపారు. బీసీ, ఎస్సీ,ఎస్టీ,మైనారిటీలతో పాటు ప్రజలందరూ అభివృద్ధి కావాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయం అన్నారు. కడప మహానాడు విజయవంతం కావడమే టీడీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. అదే విధంగా తెలుగు ప్రజలు భూమిపై ఉన్నంత కాలం టీడీపీ వ్యవస్థాప కులు ఎన్టీఆర్ వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలిపారు.

#### బాలకృష్ణ వేడుకల్లో...

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ తరువాత బాలకృష్ణ జన్మదిన వేడుకల్లో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. కేక్ కట్ చేసిన ఆయన.., అభిమానులకు శుభాకాంక్షలు చెప్పారు. సినీ రంగంతో పాటు రాజకీయ రంగంలోనూ రాణించిన బాలకృష్ణ తండ్రికి తగ్గ తన యుడని నిరూపించుకున్నాడని పేర్కొన్నారు. అనంతరరం స్థానిక రైతుకు వ్యవసాయంలో ఉపయోగపడే డ్రోన్‌ను మంత్రి గొట్టిపాటి చేతుల మీదుగా అందజేశారు.

# సినీ హీరో బాలకృష్ణ అందరివాడు

### బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా వృద్ధ మహిళకు 32 వేలు ఆర్థిక సాయం

### సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)

సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు షేక్ షహనాజ్ -సర్దార్ భాష ఆధ్వర్యంలో సినీ హీరో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 65వ జన్మదినోత్సవం సందర్భంగా ట్రస్ట్ ఆవరణలో దివ్యాంగుల సమక్షంలో ట్రస్టు వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ నటన, రాజకీయంగా నాన్నకు తగ్గ వారసుడు, అమ్మ జ్ఞాపకంగా నాన్న ఆశయ సాధనకు బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా ఎందరో అభాగ్యులకు ఆపద్బాంధవుడు, అభిమానులే కాకుండా ప్రతి ఒక్కరూ " మా బాలయ్య " అనే పద్మభూషణుడు అవార్డు గ్రహీతకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ భాష మాట్లాడుతూ సీనియర్ ఎన్టీఆర్ అభిమాని పేరు చెప్పని ప్రవాస భారతీయుడు ఆర్థిక సహకారంతో ఏ ఆధారం లేదు. వృద్ధురాలు భవానికి జీవనోపాధి, వైద్య ఖర్చులకు నిత్యవసర వస్తువులతో పాటు ఆర్థిక సాయం అందించడం జరిగిందని తెలిపారు. సినీ హీరో బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగులకు మిఠాయిలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు ట్రస్టు గౌరవ సభ్యులు మండవ సుబ్బారావు, ట్రస్టులోని దివ్యాంగులు పాల్గొన్నారు.







On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 10)

ఈ నెల 10వ తేదీన కనిగిరి మండలం లింగారెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం ముగింపు కార్యక్రమం "బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు, నివారణ' అంశం గురించి కిశోర్ బాలికలకు ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం. వి. ఎస్ .పార్వతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్వతి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల చిన్న వయసులో గర్భం దాల్చడం, ఫలితంగా ప్రసవ సమయంలోనే శిశువు మరణించడం, లేదా తక్కువ బరువుతో జన్మించడం, నెలలు నిండకముందే జన్మించడం, అనారోగ్యంతో జన్మించడం, గర్భస్రావం జరిగే అవకాశాలు అధికం గా ఉంటాయని, ప్రసవానికి ఆటంకాలు ఏర్పడతాయని బాల్య వివాహాల దుష్ఫలితాలు గురించి అవగాహన కల్పించారు. యూనిసెఫ్ నివేదిక ప్రకారం 20 ఏళ్లలో ఉన్న తల్లులకు పుట్టిన శిశువుల కంటే 18 ఏళ్ల లోపు తల్లులకు పుట్టిన శిశువుల్లో 50శాతం మరణాలు అధికమని అన్నారు. బాల్య వివాహాల నివారణ గురించి బాల్య వివాహాల నిషేధ చట్టం 2016 గురించి, బాల్య వివాహాలు జరుగుతుంటే 1098కి సమాచారం ఇవ్వాలని, మీరందరూ ఉన్నత విద్య చదివితే వీటిని నివారించవచ్చునన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి బాల్య వివాహాలపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వై శాంతమ్మ, ఆశ వర్కర్లు నాగమణి, కొండమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు సరస్వతి, జ్యోతి, ధనమ్మ ,భాగ్యలక్ష్మి గ్రామంలోని కిశోరి బాలికలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలపై అఘాయిత్యాలు పెరిగి పోయాయి

## జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలపై అఘాయిత్యాలు పెరిగి పోయాయని జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ విమర్శించారు. సేవ్ ఆంధ్ర సేవ్ వుమెన్ పేరుతో ప్రకాశం జిల్లా వైఎస్ఆర్సిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఒంగోలు అంబేద్కర్ భవనం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలను వంచించే విధంగా తయారైందని విమర్శించారు. రోజుకు ఏదో ఒకచోట మహిళల మీద అఘాయిత్యాలు జరుగుతున్న పోలీసులు పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జి చుండూరి రవిబాబు, నగరాధ్యక్షులు కటారి శంకర్,బొట్ల సుబ్బారావు మహిళా లీగల్ సెల్ కన్వీనర్ నిర్మలారెడ్డి, గొనెల మేరీ కుమారి, బండ్లమూడి వాణి, బొప్ప రాజు జ్యోతి, బెల్లంకొండ రవణమ్మ, కుందూరు రమణ, సంతనూతలపాడు మండల మహిళా అధ్యక్షురాలు మొలకలపల్లి సీతమ్మతో పాటు సర్పంచ్ శైలజ, లక్ష్మి జంగాల లక్ష్మి, ప్రసన్న దాసరి సుజాత ఇతరులు పాల్గొన్నారు.




# సాక్షి పేపర్లను, ప్లకార్డులను దహనం చేసిన కూటమి మహిళా నేతలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)

సాక్షి మీడియాలో అమరావతి మహిళలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలపై తెలుగుదేశం కూటమి మహిళా నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాక్షి ఛానల్ రద్దు చేయాలని జగన్మోహన్ రెడ్డి భారతిలను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఒంగోలు కలెక్టర్ కార్యాలయం నుంచి ఒంగోలు ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి సాక్షి పేపర్లను, ప్లకార్డులను దహనం చేశారు. ఈ సందర్భంగా మహిళా నేతలు మాట్లాడుతూ అమరావతిపై వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు భ్రమరావతి అంటూ అపహస్యం చేశారని, మహిళా రైతులను పోలీసులు చేత కొట్టించారని, దాని ఫలితంగానే 11 సీట్లు పరిమితమైనా ఇంకా వారికి సిగ్గు రాలేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ఐదేళ్లు భరించిన ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్పినా ఇంకా అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. అమరావతి మహిళలను కించపరిచే విధంగా సాక్షి చానల్లో డిబేట్లో పెట్టి అమరావతిపై విషం కక్కుతున్నారని అన్నారు. ఈరోజు కూటమి ప్రభుత్వం మహిళలపై దాష్టికాలు చేస్తుందంటూ వైసీపీ మహిళా విభాగం నిరసనలు ర్యాలీలు చేపట్టడం సిగ్గుచేటు అని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో మహిళలపై ఎన్నో అగాయి త్యాలకు తెగబడింది వైసిపి నాయకులు కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి, భారతి ప్రజలకు క్షమాపణ చెప్పాలని లేకుంటే ఉద్యమం ఇంకా తీవ్రత చేస్తామని వారు హెచ్చరించారు. సాక్షి పేపర్ సాక్షి టీవీ ఒక అబద్ధాలతో మాట్లాడుతూ ఎప్పుడూ మహిళలని కించపరుస్తూ ఉంటున్నారని , అదేవిధంగా గత రెండు రోజుల క్రితం జరిగిన డిబేట్లో అమరావతి మహిళలు వేశ్యలు అంటే ఉన్నతమైన రాజధాని కించపరుస్తూ 13 జిల్లాల మహిళలు కూడా కించపరిచినట్లు లేనని, సాక్షి పేపర్ యజమాని అయిన భారతీ రెడ్డి పై కేసు నమోదు చేయాలని ఆమెను అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షురాలు రావుల పద్మజ, మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్ల వెంకటరత్నం, రాయపాటి సీతమ్మ, బీరం అరుణ రెడ్డి, కే.కుసుమ కుమారి,నరసమ్మ, ఉప్పలపాటి నాగేంద్రమ్మ, బీజేపీ మహిళా నాయకురాలు, జనసేన మహిళ నాయకురాలు టిడిపి నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేత

(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, జూన్ 10)

మద్దిపాడు మండలం కోస్టాల్ గ్రామం వద్ద మని ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం జరిగిన ఫైనల్లో విజేతగా నిలిచిన మొదటి బహుమతి ఏండ్లూరు టీం కు 1,00,000 లక్ష రూపాయలు బహుమతి అందించారు. రెండో బహుమతి మని ఫ్రెండ్స్ మద్దిపాడు టీమ్ 75,000 వేల రూపాయలను, మొమోంట్లను అందజేశారు. మద్దిపాడు గ్రామంలో మని ఫ్రెండ్స్ టీం సహకారంతో మద్దిపాడు గ్రామంలో వికలాంగులతో బాధపడుతున్న గుంటూరు విసికాకి 20,000 వేలు ఆర్థిక సహాయం సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి. ఎన్. విజయ్ కుమార్ అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వరావు, పోతినేని శ్రీనివాసరావు మందపల్లి శ్రీనివాసరావు , మొనపాటి రామకృష్ణ ,గడ్డం రవి, దాసరి రమేష్, మార్నేని రాఘవ, లాలు, శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.
















# విద్యుత్ అధికారుల ఆకస్మిక తనిఖీలు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్ఛార్జి, జూన్ 10)

మార్కాపురం పట్టణంలో మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులు 36 బృందాలుగా విడిపోయి సుమారు 1351 సర్వీసులు ఇన్స్పెక్షన్ చేయడం జరిగింది. ఈ తనిఖీలలో విద్యుత్ మీటర్ లేకుండా అనధికారికంగా వాడుతున్న 13 మందిపై డైరెక్ట్ టాపింగ్ కేసులు రాయడం జరిగింది. విద్యుత్ సర్వీసు ఉండి కూడా అదనపులోడు వినియోగిస్తున్న 30 మందిపై అడిషనల్ లోడ్ కేసులు మరియు ఒక కేటగిరి ఉండి మరియొక కేటగిరిలో వాడుతున్న వారిపై మాల్ ప్రాక్టీ కేసులు రాయడం జరిగింది. మొత్తం 58 కేసులకు గాను ఒక లక్ష 97 వేల రూపాయలు అపరాధ రుసుము విధించారు. ఈ తనిఖీలు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మార్కాపురం పి వి నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డీపీఈ ఒంగోలు ఉషారాణి ఆధ్వర్యంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మార్కాపురం ఎస్. సియా నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కంభం, గిద్దలూరు, వై పాలెం, వివిధ మండలాల విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాటమరాజు ఆలయ పరిధి సర్వే జరిపి తీర్మానించాలి



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 10)

మండలంలోని గుండంచర్ల గ్రామంలో వెలసిన శ్రీ వేణుతల కాటమరాజు ఆలయ పరిధి ఏ మేరకు ఉంటుందో సర్వే జరిపి తీర్మానించాలని మంగళవారం మార్కాపురం పట్టణంలో ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మా గంగరాజు యాదవ్ మార్కాపురం ఫారెస్ట్ రేంజ్ అధికారిని కోరారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నీళ్లు వచ్చే రోజులు ముందున్నందున ఇప్పుడున్న గుండంచర్ల దారిలో ఆలయంకు వెళ్ళే దారి మూసుకు పోతుందని, కొత్త దారి వేయాలని, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో కొత్తగా దారిని ఏర్పాటు చేయవలసిందిగా మార్కాపురం డీఎఫ్వోని కోరారు. డిఎఫ్ఓ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఫారెస్ట్ రేంజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని కమిటీ చైర్మన్ గుమ్మా గంగరాజు యాదవ్, ముఖ్య బాధ్యులు పిఎల్పి యాదవ్లకు తెలిపారు. అంతకు ముందు రేంజీ కార్యాలయంలో డిఆర్ఓ నాగరాజు తదితర అధికారులతో గుడి గురించి చర్చించారు.

# 5వ తరగతి చదువుతున్న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు శుభవార్త

## నవోదయ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలకు ఉచిత కోచింగ్




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 10)

కేటీసీ సంస్థను స్థాపించి 10 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా 5వ తరగతి చదివే విద్యార్థుల కోసం జూన్ 8,15,22,29, జూలై 6 తేదీలలో సుభాష్ రోడ్డులోని కేటీసీ స్టడీ సర్కిల్లో ఒక మోడల్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ మోడల్ టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపిన వారికి ఉచితంగా నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలకు కోచింగ్ ఇవ్వబడుతుందన్నారు. ఈ మోడల్ టాలెంట్ టెస్టు రాయదలిచిన వారు ముందుగా 6303423038కి కాల్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోగలరు. ఈ సమాచారాన్ని 5వ తరగతి చదువుతున్న ప్రతి ఒక్కరికీ తెలియజేసి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసేందుకు మీ వంతు ఈ సమాచారాన్ని అందరికీ పంచుతారని ఆశిస్తున్నామని డాక్టర్ కేటీసీ పాపారాయుడు, చైర్మన్ కేటీసీ ఎడ్యుకేషనల్,రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సెల్. 8332977207, 8332977607, 6303423038ను సంప్రదిం చాలని కోరారు.